
# గ్రీష్మం అని గుత్త

- కె.సునీల్ గూరి



తెలిసిన మనిషి దూరదేశాలకి వెళ్లి స్థిరపడ్డాడంటే అతనిపై అందరికీ అదో రకమైన గౌరవం ఏర్పడుతుంది. పుట్టిన ఊరికి చాలా సంవత్సరాలకి వస్తున్నాడంటే కుటుంబ సభ్యుల పెదవులు నవ్వులతో, కళ్లు నిరీక్షణతో నిండిపోతాయి.

***

సూట్‌కేస్‌లో పదిజతల కొత్త బట్టలున్నాయి. అందులో రెండు జతలు నాన్నవి, మిగతావి అమ్మకి, చెల్లికి. ఇంకా రెండు జతల షూలు, ఓ చెక్‌బుక్, ఓ సిగరెట్ పెట్టె వున్నాయి.

హైద్రాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా బస్టాండ్‌కొచ్చి మా ఊరికి బయలుదేరాను. బస్సులో నేను, కండక్టర్, ఓ ముసలాయన మాత్రమే వున్నాము. కిటికీ పక్కన కూర్చొని బయటికి చూస్తుంటే, ఏదో తెలియని వింత అనుభూతి కలిగింది. నీళ్లులేక కాబోలు చాలావరకు పొలాలు బీళ్లయినాయి. దారిలో ఎన్నో కొబ్బరి చెట్లు, మరెన్నో పెద్దవృక్షాలున్నాయి. నా అనుభవాలంత ఎత్తుగా నా జ్ఞాపకాలంత స్థిరంగా...

బస్సు ఊరి పొలిమేరల్లో ఉండగానే దూరంగా మా ఇల్లు కనిపించింది. ఇంటిముందు ఎవరో స్త్రీలా కనిపించింది. నిల్చుందో కూర్చుందో తెలియట్లేదు. అమ్మ కాబోలు. ఎడబాటంటే ఏంటో తెలియని వయసులో దూరంగా వెళ్ళిపోయాను. ఇవాళ అమ్మని, నాన్నని, చెల్లిని కలుసుకుంటున్నానంటే – ఏదో తెలిసీ తెలియని కొత్త సంతోషంతో మనసు చాలావరకు నిండిపోయింది. బస్సు ఊరిలోకి ప్రవేశించింది. విపరీతమైన వేడి శరీరాన్ని చెమట ముద్దగా మార్చింది. ఇలా అనుకుంటుండగా బస్సాగింది. అక్కడ స్టాప్ అంటూ ఏమీలేదు. ఒక పెద్ద మర్రిచెట్టు, దాని చుట్టూతా సిమెంటు గచ్చు లాంటిది కాస్త ఎత్తులో వుంది.

బస్సు దిగగానే తలపాగా చుట్టుకున్న ఓ ముసలాయన నన్ను చిత్రంగా చూస్తూ కదిలాడు. చూపు అత

న్నుంచి మరల్చేసరికి పక్కనే చెల్లి.. ఏడుస్తూ నాన్న..

***

"నాతో మాట్లాడవా అమ్మా" నేనొచ్చి గంటపైనే అవుతోంది. రాగానే ఒళ్లోకి తీసుకుంటే కన్నీళ్ళు కార్చింది. అప్పట్నించి నా కళ్ళలోకి చూస్తూ సిగ్గుపడసాగింది.

'ఏం మాట్లాడాలి' అడిగింది వడ్డిస్తూ...

నిజమే. పది సంవత్సరాల క్రితం ఇంట్లో చెప్పకుండా వెళ్లిన నాకు నా తల్లిదండ్రుల బాధ ఏం తెలుస్తుంది. ఆ వయసులో నాకు తోచింది చేశాను. విచక్షణకు తావివ్వలేదు. ఇంటర్ పరీక్షల్లో తప్పుతానని తెలిసినా ఇంట్లోవారికి నా ఫలితంపై ఎన్నో ఆశలు పెంచాను. నిజం తెలిస్తే నాన్న క్షమించడని తెలుసు... నా ఒంటిమీద ఒక్క దెబ్బపడకుండా వుండడానికి నాకు నేను వేసుకొన్న శిక్షే ఈ పది సంవత్సరాల పయనం.

***

ఆరోజు రాత్రి అందరం కలిసి భోజనం చేశాము. అమ్మ నాకిష్టమైనవి అన్నీ చేసింది. నాకిష్టమైన పదార్థాలు అమ్మ గుర్తుపెట్టుకోవడం – నాకేమాత్రం ఆశ్చర్యం కలిగించలేదు. చిన్నప్పుడు నాన్న బెడ్‌రూంలా వుండిన గదిలోనే నేను పడుకున్నాను. నిద్రపడ్డడానికి అట్టే సమయం పట్టలేదు. పొద్దున ఐదింటికి మెలకువ వచ్చింది. నేను తప్ప ఇంకెవరు లేవలేదు. ఎండాకాలం కాబట్టి త్వరగా వెలుతురు వచ్చింది. నా చిన్నప్పుడు తెలుగు సబ్జెక్టులో నేను మొదటగా నిలిచేవాడ్ని. కానీ ఇప్పుడు చాలా పదాలు గుర్తు రావడంలేదు. ముఖ్యంగా ఈ ఋతువుల విషయం. ఏ మాసంలో, ఏ ఋతువుంటుందో నాకొకప్పుడు బాగా గుర్తుండేది. ఇప్పుడు అన్ని ఋతువుల పేర్లూ మర్చిపోయాను, కానీ ఎండాకాలాన్ని మాత్రం గ్రీష్మం అంటారని లీలగా గుర్తు. బయట వరండాలోకొచ్చాను. మా ఇల్లు కొంచెం చిన్నదే, నాలుగు గదులు చుట్టూ పూలమొక్కలు, వరండాలో నాన్న లూనా వుంది. చిన్నగేటు, గేటు ముందర సిమెంట్ రోడ్డుకి అవతల మరో ఇల్లు. కొంచెం పెద్దది, ఆ ఇంటిని చూడగానే మనసు పది సంవత్సరాల వెనక్కెళ్ళింది. జ్ఞాపకాల తోటలో అనుభవాల పందిరి కింద పూచిన తెల్లటి మల్లెలాంటి రోజులవి, మాధవితో పరిచయమున్న రోజులు.

స్కూల్లో మాధవి నా జూనియర్. రోజూ ఉదయం చెల్లికోసం ఇంటికొచ్చేది. నాతో బాగానే మాట్లాడేది. స్కూల్లో నన్నెప్పుడు 'అన్నయ్యా' అని పిలుస్తుందా అని భయమేసేది. ఆ వయసులోనే ఆమెపై ఏదో ఆకర్షణ ఏర్పడింది. ఇప్పుడు మాధవికి నేను గుర్తున్నానో లేదో తెలియదు. చెల్లెలుతోపాటు చదువుతుందని మాత్రం తెలుసు. ప్రస్తుతం వాళ్ళ ఇంటిపైనే ఇంకో అంతస్తు కడుతున్నారు.

స్కూల్లో మాధవి నా జూనియర్. రోజూ ఉదయం చెల్లికోసం ఇంటికొచ్చేది. నాతో బాగానే మాట్లాడేది. స్కూల్లో నన్నెప్పుడు 'అన్నయ్యా' అని పిలుస్తుందా అని భయమేసేది. ఆ వయసులోనే ఆమెపై ఏదో ఆకర్షణ ఏర్పడింది. ఇప్పుడు మాధవికి నేను గుర్తున్నానో లేదో తెలియదు.

కాలకృత్యాలు తీర్చుకొని హాల్‌లోకొచ్చేసరికి నాన్న పేపరు చదువుతున్నారు. ముందర టేబుల్‌పై టీ కప్పు వుంది. దాని పక్కనే ఆష్‌ట్రే వుండాలి. లేకపోయేసరికి సిగరెట్లు మానేశారు కాబోలు అనుకున్నాను. ఆ అలవాటు నాన్ననుంచి నాకు అబ్బింది అన్న ఆలోచనకు నవ్వొచ్చింది. వంటింట్లో అమ్మ నన్ను చూసి 'అప్పుడే లేచావే' అంది. నాకు లేవాలనిపించిందని చెప్పి టీ కప్పు తీసుకొని కూర్చున్నాను. అమ్మ కూడా నా పక్కనే కింద కూర్చుని చెప్పింది. "చెల్లికి నేడు ఆఖరిపరీక్ష. రాత్రి మాధవి ఇంటికెళ్ళింది – చదువుకోవడానికి, పరీక్ష రాశాకే ఇంటికొస్తానంది". కాసేపు నిశ్శబ్దం. మళ్ళీ అమ్మే అంది – "నువ్వు పంపే డబ్బుతోనే అది డిగ్రీ చదివిందిరా. దాన్ని చదివించే స్థోమత మాకు లేదు. నిన్నెప్పుడు అది సమర్థిస్తూనే వుంటుంది" నేనొచ్చినప్పటినుంచి అమ్మ నాతో గౌరవంగా మాట్లాడడం నాకు ఇబ్బందిగా అనిపిస్తోంది.

***

ఇంటర్ పరీక్ష ఫలితాలు వచ్చిన సాయంత్రం పక్క టౌన్‌లో వున్నాను. అక్కడయితే ఫలితాలు త్వరగా వస్తాయి. పైగా ఇంటికి దూరం. ముఖ్యంగా నాన్నకి. నేనూహించినట్టుగానే నా నెంబర్ లేదు. నాకు చదువంటే ఎప్పుడూ నరకకూపమే. ఏదీ గుర్తుండేది కాదు. ఆ రాత్రి వరకు ఎవరికీ కనిపించకుండా ఊరి పొలిమేరల్లోని మామిడి తోటలో వున్నాను. అప్పటికీ చెల్లి ఏడవ తరగతి. నాన్న చదువు విషయంలో చాలా నిక్కచ్చిగా వ్యవహరించేవాడు. పదో తరగతి సెకండ్ క్లాస్ వస్తేనే వారంపాటు నాపై చిందులు వేశాడు. అమ్మ నా గురించి పడే బాధను తలచుకుంటే మళ్ళీ ఇంటికెళ్లాలనిపించింది. కానీ నాతో చదువుకున్న స్నేహితులు ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. మా ఊరిలో పరీక్ష తప్పిన ముగ్గురిలో నేనొక్కడిని. ఈ నిజం నన్ను ఊర్లోకెళ్లకుండా కట్టిపడేసింది.

ఉదయాన్నే మళ్ళీ టౌన్‌లోకెళ్ళి ఓ స్నేహితుడి దగ్గర వంద రూపాయలు తీసుకుని హైద్రాబాద్ బస్సెక్కాను. వెనుకముందు ఏమీ ఆలోచించలేదు. అంతకుముందు రాత్రి నిద్రపట్టకపోయేసరికి బస్సులో మగతగా నిద్రపోయాను. కలలో చెల్లి నా గురించి అమ్మనడుగుతుంటే అమ్మ దాన్నొళ్ళోకి తీసుకుని నాన్నని చూస్తూ ఏడుస్తుందంట – స్వప్నం. నిజజీవితాన్ని కల్పనతో మిళితం చేస్తుంది. అదే దాని అందం. ఆ అందం మనసుకి అప్పుడప్పుడు ఆనందాన్నిస్తుంది. కానీ చాలాసార్లు బాధపెడుతుంది.

సిటీలో వారంరోజులు బస్టాండ్‌లోనే గడిపాను. ఎవరో ఓ ఆసామికి నాపై కన్నుపడింది. నా వివరాలన్నీ తెలుసుకొని 'నాతోపాటు వస్తావా' అన్నాడు. ఆయనకో గ్రానైట్ ఫ్యాక్టరీ వుంది. ఆ ఆఫీసులో రెండు సంవత్సరాలు పనిచేశాను. అక్కడే నాకు బాగా పరిచయమైన మనిషి వినాయకరావు గారు. ఆయన ఆరు అడుగులపైనే వుంటారు. నల్లటి వర్చస్సు. చిన్నవయసులోనే పూర్తిగా బట్టతల వచ్చేసింది. అవసరం లేకపోయినా టై కట్టుకునేవారు. అందరూ ఆయన్ని చిన్నచూపు చూసినా ఎవర్నీ పట్టనట్టుండేవారు. ఆయనకి ఇద్దరు ఆడపిల్లలు పెద్దమ్మాయి డిగ్రీ చివరి సంవత్సరం. చిన్నమ్మాయి పదవ తరగతి.

ఆ వినాయకరావు గారు ఆఫీసుకు రావడంతోనే బిగ్గరగా నవ్వుతూ అందరినీ కలియజూశాడు. రోజూ ఆఫీసులో పడుకునే నాకూ నిద్రమత్తు ఇంకా వదల్లేదు. విషయం తెలుసుకుందామని నేనూ స్టాఫ్ దగ్గరకొచ్చాను. "అంతా అనుకున్నట్టే జరిగింది. నిజంగా నా బిడ్డలకోసమే... ఈ ప్రయాణం. నా కష్టం ఆందోళన అదృష్టదేవత ఆలకించింది. పోతే చిన్న చిక్కొచ్చిపడింది.". అంతలో ఓ గుమస్తా నన్ను "వినాయకరావు గారి పేరుమీద ఓ పది 'టీ'లు" అని పురమాయించాడు. ఐదు నిముషాల్లో నేను వెళ్ళివచ్చి గుమ్మంలోకి రాబోతుండగా ఒకేసారి అందరి కళ్ళూ నావైపు తిరిగాయి. నాకేమీ అర్థంకాక 'కప్పు'లో 'టీ' పంపుతున్నాను.

వినాయకరావు గారికి దుబాయ్‌కి వీసా వచ్చింది. అక్కడ తనకు తెలిసిన డాక్టర్ వున్నాడంట. ఇరవై యేళ్ళపైనే ఓ హాస్పిటల్‌లో ఫిజిషియన్‌గా చేసిన ఆయన సొంతంగా ఓ జనరల్ హాస్పిటల్ కట్టించాడట. అందులో వినాయకరావు గారిని ఏదైనా క్యాంటీన్ తెరిస్తే బాగుంటుందనేసరికి ఇద్దరు ఆడపిల్లలు గల వినాయకరావు వేరే ఆలోచన లేకుండా తను దాచుకున్న ఐదు లక్షల రూపాయలతో ఇంకో వారం రోజుల్లో ప్రయాణానికి సిద్ధమయ్యాడు. క్యాటీన్‌లో తనకి సహాయకుడిగా అవసరం వుంటుందంటే నన్ను ఆఫీస్‌లో పెట్టించిన ఈ సంస్థ జనరల్ మేనేజర్ నన్ను తీసుకెళ్ళమన్నాడంట.

***

దుబాయ్ వెళ్లినప్పటినుంచి ఇంట్లోవాళ్ళకి ఫోన్ చెయ్యసాగాను. అమ్మతో మాట్లాడడం నాకు ఊరట. చెల్లి ఊరి విషయాలు ఎన్నో చెప్పేది. మాధవిని అడుగుదామన్న ప్రతిసారి ఏదో మొహమాటం అడ్డొచ్చేది. నాన్నకి నామీద కోపం పోయింది. నా పరిస్థితిని అర్థం చేసుకొనుంటారు.

కాల ప్రమాణాల్లో ఎన్నో రోజులు గడిచాయి. రోజురోజుకి వినాయకరావు గారి వ్యాపారం పుంజుకోసాగింది. నాకు ఇక్కడ బాగానే అలవాటయ్యింది. నామీద వినాయకరావు గారికి చాలా నమ్మకం. ఎందుకంటే వారిక్కూడా ఇక్కడ 'నా' అన్నవాళ్ళెవ్వరూ లేరు, నేను మినహా... అలా ఓ సంవత్సరం గడిచాక హాస్పిటల్‌కి కొద్దిదూరంలో వినాయకరావు గారు ఓ సూపర్ మార్కెట్ తెరిచారు. అది వారే చూసుకుంటూ క్యాంటీన్ బాధ్యతలు పూర్తిగా నాకు అప్పజెప్పారు. ఇలా ఓ ఐదు సంవత్సరాలు గడిచాక ఇండియాకి వెళ్ళి ఇద్దరు బిడ్డల పెళ్ళి ఒకేసారి చేశారు. నన్ను బలవంతం చేసినా నేను వెళ్ళలేదు. తర్వాత దుబాయ్‌కి భార్యతో వచ్చి సెటిల్ అయ్యారు. ఓరోజు రాత్రి బార్లో ఇద్దరం తాగుతుండగా చెప్పారు –

"రేపటినుంచి క్యాంటిన్ నీ సొంతం..." ఏవో కాగితాలు చేతుల్లో పెడుతూ...

***

బెల్ మోగుతుండగా పరధ్యానం నుంచి బయట

పడ్డాను. నాన్న స్నానానికి వెళ్ళాడు. అమ్మ ఉప్మా చేస్తోంది. పేపర్లో దుబాయ్‌కి సంబంధించిన వార్త చూస్తూ గతం నెమరేసిన నేను లేచి తలుపు తీశాను – ఎదురుగా చెల్లి, మరో అమ్మాయి వున్నారు. చెల్లి నన్ను ఆశ్చర్యంగా చూస్తూ... ''గుర్తుపట్టావా అన్నయ్యా.. మాధవి'' అంది.

చిన్నప్పటి మాధవిని నా ఎదురుగా వున్న రూపంతో పోల్చుకోలేకపోయాను. ఇప్పుడు నా అంత ఎత్తు వుంది. మల్లెపూవుని స్పృశిస్తే తనువు పొందే అనుభూతిని ప్రస్తుతం నా కళ్లు పొందుతు న్నాయి. నన్నోసారి సూటిగా కళ్లలోకి చూసి నవ్వింది. ఇద్దరూ రూంలోకి వెళ్ళారు. సోఫాలో వది లేసిన పేపరు తీస్తే చదవాలనిపించలేదు. హృదయం మాధవి అందానికి తన్మయం చెందింది.

***

మరుసటిరోజు అందరం కలిసి రామప్పకి వెళ్ళాం. దారిలో చెల్లి, అమ్మ, నాన్న నేనుంటున్న ప్రదేశం గురించి అడిగి తెలుసుకున్నారు. వారం రోజులుగా చెబుతున్న విషయాలు నిజానికి అయి పోవచ్చాయి. ఏది అడిగినా ఆలోచించి మరీ చెప్పాల్సి వస్తోంది. ఆ రాత్రి హోటల్లో డిన్నర్ చేసి ఇంటికెళ్ళాం. పడుకోబోయే ముందు అమ్మ నా రూంలోకి వచ్చి పెళ్ళెప్పుడు చేసుకుం టావని అడిగింది. తెల్లారి మాట్లాడుదామని దాటేసి పడుకొన్నాను. నిద్రలో మాధవిని పెళ్ళి చేసుకున్నట్టు కలొచ్చింది.

మరుసటిరోజు మధ్యాహ్నం భోజనాలయ్యాక అమ్మ, చెల్లి సమక్షంలో చెప్పాను. ''నేను వెళ్ళేలోగా తప్పకుండా పెళ్ళి చేసుకుం టాను. సంబంధాలు మాత్రం అప్పుడే చూడవద్దు.''

నిజంగా ఈ వయసులో నాకు స్త్రీ అవసరం ఎంతో వుందని అనిపిస్తుంది. యవ్వనంలో వుండే ఆకర్షణని ఏ బంధంలోనైనా ఇమ డ్చగలిగితే అది 'పెళ్ళి' అవుతుంది. నా సన్యాసి జీవి తంలోకి ఓ సన్యాసినిని ఆహ్వానించాలని వుంది. అదే విషయం చెల్లితో చెప్పి మాధవిని రేపు కలుస్తాను. 'అదీ ఒంటరిగా'. నాన్న కొలీగ్ వాళ్ళబ్బాయి పెళ్ళికి ఇంట్లో అందరూ వెళ్తున్నారు. కనీసం రెండు గంటల యినా ఖాళీ దొరుకుతుంది. మాధవితో విషయం తేల్చాలని నిశ్చయించుకున్నాను.

***

తెల్లారి అందరూ పెళ్లికి బయలుదేరడానికి సిద్ధప డుతుండగా చెల్లి అదోలా చూస్తూ దగ్గరికొచ్చి 'ఆల్ ది బెస్ట్' అని చెయ్యి చాచింది. అందరూ వెళ్లిన అర గంటకి మాధవి వచ్చింది. వేసవి వేడికి ఆమె ముంగురులు నుదుటికి అతుక్కున్నాయి. ఇవాళ ఎండ మరీ ఎక్కువగా వుంది. మళ్ళీ ఈ ఋతువు ఏంటా అని ఆలోచిస్తే గ్రీష్మం కదూ అనిపించింది. నేను వెళ్ళి ఎ.సి. ఆన్ చేశాను.

''ఫర్లేదు ఫ్యాన్ వేస్తే సరిపోతుంది'' అంది.

నేను అడగాలనుకున్న విషయం చెల్లికి తెలుసు. ఇంకా నా గురించి ఏం చెప్పిందో ఊహించలేకపోతు న్నాను. ప్రస్తుతం ఎలా మొదలుపెట్టాలో అర్థం కావ ట్లేదు.

''పరీక్షలు బాగా వ్రాశారా?''

''బాగానే వ్రాశాను.''

''తర్వాత ఏం చేద్దామని?''


''ఇంకా ఏమీ అనుకోలేదు''

ఫ్రిజ్‌లోంచి రెండు కూల్‌డ్రింక్స్ తీసుకొచ్చి ఆమె కొకటి ఇచ్చి నేనొకటి తీసుకున్నాను. తెల్లటి చుడీదా ర్‌లో హంసల సమూహం జరీ అంచు చున్నీతో వెన్నె లతో చేసిన ప్రతిమలా వుంది మాధవి. విషయం నాన్చబుద్దేయడం లేదు. ఆమెకీ నాకూ ఇద్దరికీ పెళ్ళీడు వచ్చింది. నేను ఆమెను పిలిచిన ఈ సంద ర్భానుసారం ఆమెకు కూడా తెలిసేవుంటుంది.

''మీ డ్రెస్ చాలా బాగుంది'' అన్నాను.

దానిమ్మ వరుసలోని పళ్ళు బయటపడ్డాయి. ఆమె నవ్వు ఆమెలాగే అందంగా వుంది.

థాంక్స్ అంటూ దుబాయ్‌లో




నా వ్యాపారం గురించి అడిగింది. లేచి వరండాలోకి నడిచాము. చెరో కుర్చీలో కూర్చున్నాము. ఇద్దరి మధ్య నిశ్శబ్దం. నేను ధైర్యంగా ''మీకో విషయం చెబుదామని పిలిచాను'' అన్నాను. సూటిగా కళ్ళలోకి చూసింది. ప్రశ్నార్థ కంగా కాదు.

నా మనసులోని భావం ఆమె కళ్ళల్లో కనిపిం చింది.

తడబడుతూ చెప్పాను. ''మిమ్మల్ని చూసినప్ప ట్నుండీ నాకు...''

''ఒక్క నిముషం'' మధ్యలో అడ్డుపడింది. ఇది నేనూహించలేదు.

''మీరేం అడగదల్చుకున్నారో నాకు తెలుసను కుంటున్నాను. ఆ తెలిసింది నిజమేనని కూడా అను కుంటున్నాను. ఇవాళ మీరు రమ్మన్నారంటే నాకు అనుమానం వేసింది. మా ఇంట్లో వాళ్ళు కూడా మీవాళ్ళతో పెళ్ళికి వెళ్ళారు. మీ చెల్లి ఈ విషయం చెప్పగానే అప్పుడు వారిద్దామనుకున్నా కానీ అసలు విషయం ఇది కాకపోతే నా అనుమానం తప్పవుతుందని స్వయంగా వచ్చాను. నిజానికి మీరంటే నాకు చాలా గౌరవం వుంది. ఇంట్లోనుంచి పారిపోయినప్పుడు మీపై ఏర్పడిన చెడుభావం ఆ తర్వాత మీ చెల్లిని చదివిస్తూ ఇంట్లో అవసరాలు తీర్చినప్పుడు పోయింది. ఓ అబ్బాయి తనను ప్రేమిస్తున్నాడంటే ఆ విషయం ఏ అమ్మాయికైనా తేలిగ్గా తెలిసిపోతుంది. ప్రేమించడం తప్పుకాకపో వచ్చు. కానీ ప్రేమ నిలవాలంటే కొన్ని పరిస్థితులు దానికనుకూలించాలి. నాకూ పెళ్ళీడు వచ్చింది. మా ఇంట్లో ఓ అబ్బాయిని అనుకున్నారు. ఇంకో రెండు నెలల్లో పెళ్ళి జరగవచ్చు. నేనతన్ని ప్రేమిస్తున్నానో, లేదో తెలియదు. కానీ మా కుటుంబం మొత్తం ఆ అబ్బాయిని ఆమోదించారు. అతను కెనడాలో సివిల్ ఇంజనీర్. ఈ విషయం నేనింతవరకు ఎవ రితో చెప్పలేదు మీ చెల్లితో సహా. అతనితో నాకు మంచి పరిచయం వుంది. నా జీవితం అతనితో పంచుకుంటే బాగుంటుందని అనిపిస్తోంది.

మనం స్నేహితులుగా మిగిలిపోదాం. స్నేహంలో వుండే గౌరవం ప్రేమలో కూడా వుండదు. మీరు నన్ను ప్రేమి స్తున్నారని ఓ మాట చెప్తే అది ఇద్దరి మనసులో కలవరం లేపుతుంది. స్వచ్ఛంగా స్థిరంగా వున్న కోనేటిలో రాయి వేసిన చందంగా, అలల్లా చిందరవందర వొద్దు. మన స్నేహం స్థిరంగా వుండాలంటే మీకు నాపై ఆ భావం వద్దు, ప్లీజ్...'' చెప్పడం ఆపి – తల దించుకుని నేలవైపు చూసింది.

మా పక్కనే వున్న సంపంగి పూల చెట్టునుంచి అంతకు ముందు వచ్చిన సుగంధం ఇప్పుడు రావట్లేదు. నా మెదడులో శూన్యం... బ్రహ్మాండరూపం దాల్చడా నికి సమాయత్తమవుతోంది. నాపై ఆమెకు గల అభిప్రాయానికి ఆనందించాలో, దుఃఖించాలో తెలియట్లేదు. మరో పది నిముషాలు అలా నిశ్శబ్దంగా కూర్చున్నాం. ఆమె వెళ్తానంటే నేనూ ఆపలేదు. మధ్యాహ్నం ఎండ తీవ్రంగా వుంది. వేడిసెగలు నన్నావరించాయి. 'గ్రీష్మ ఋతువు' అనే పదం ఒక్కటే మెదడులో వుంది – ప్రస్తుతం.

కాలం ఒక్కటే అయినా దానిలో ఋతువులు వేరు... అందులో ఏ ఋతువు నిలిచేది కాదు... ఎల్ల ప్పుడు నిలిచేది కాలం అనే ఋతువు మాత్రమే... నా ప్రేమ అనే కాలాన్ని మాధవి ఋతువులా మార్చింది. ఆఋతువులోనే ఇప్పటి అనుభవం కూడా చేరుతుంది. కాబట్టి ఈ ఋతువుకి చెందిన నా అస్థిరప్రేమకు మారుపేరేనేమో ఈ గ్రీష్మం.

***

ఆ మరుసటిరోజే దుబాయ్‌కి బయలుదేరాను. అమ్మ, నాన్న, చెల్లి వారిస్తుంటే వచ్చేయేడు తప్ప కుండా వస్తాననీ, అర్జెంట్‌గా బయలుదేరి రమ్మని ఫోన్ వచ్చిందనీ అబద్ధం చెప్పాను.

★